క్లుప్తంగా

వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ



తిరువూరు: స్థానిక మండల ఆఫీసు రోడ్డులో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా అలంకరించి మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో వాసవీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేద పండితులు శాంతి హోమాలు, లక్ష్మీగణపతి హోమం, అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దారా శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం చేశారు.

మజ్జిగ పంపిణీ



మైలవరం: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. అంబికా బోస్‌బాబు, కస్తూరి దంపతుల జ్ఞాపకార్థం ఆలుమూరి చంద్రశేఖర్ మజ్జిగను సమకూర్చారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల బీసీఏ, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు శనివారం గుంటూరు జిల్లాలోని ఆత్మకూరు కోకోకోలా కంపెనీకి క్షేత్ర పర్యటనకు వెళ్లారు. కంపెనీలో ఉత్పత్తి ప్రక్రియ, నాణ్యతా పరిశీలన, సరఫరా విధానం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతిక అంశాలపై, మార్కెటింగ్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకు క్షేత్ర పర్యటన ఉపయోగపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

విద్యార్థుల ఇంటింటి సర్వే



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పర్వతాపురం, సబ్జపాడు గ్రామాల్లో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కుటుంబ సభ్యుల విద్య, వ్యాపార, వ్యవసాయ, జీవనాధార సమాచారాన్ని సేకరించారు. ప్రిన్సిపాల్ కె. అప్పారావు మాట్లాడుతూ సర్వేలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. సర్వే సమాచారాన్ని ఉన్నత భారత్ అభియాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఉన్నత భారత్ అభియాన్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్ పాల్గొన్నారు.

సారా కేసుల్లో నిందితుల బైండోవర్

విస్సన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో సారా కేసుల్లో నిందితులను ఎక్సైజ్ అధికారులు శనివారం విస్సన్నపేట తహసీల్దారు లక్ష్మీకల్యాణి ఎదుట బైండోవర్ చేశారు. తాతకుంట్ల తండాకు చెందిన బాణావతు మోతీ, తెల్లదేవరపల్లికి చెందిన ధరావతు నాగమణి, భూక్యా రాణి, చంద్రుపట్లకు చెందిన మరీదు జమలమ్మ, కలగరకు చెందిన వేముల ధనలక్ష్మిలను బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

నందిగామ టౌన్:పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. దీనిలో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, బండారు కేదార్‌నాథ్, పులిపాటి శ్రీనివాసరావు, కొప్పు రామారావు, కొంగర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వేలం ద్వారా రూ.16.62 లక్షలకు పైగా ఆదాయం

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ వారి ఆలయంలో శనివారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.16,62,800 ఆదాయం వచ్చినట్లు ఈఓ కిశోర్‌కుమార్ తెలిపారు. ఆలయ బేడా మండపంలో జరిగిన బహిరంగ వేలం ద్వారా ఏడాది పాటు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు 13 దుకాణాల వేలం ద్వారా రూ.14,96,800 ఆదాయం రాగా, ఎలక్ట్రికల్ స్క్రాప్ ద్వారా రూ.రూ.1,05,000, సివిల్ స్క్రాప్ ద్వారా రూ.61,000 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ రమ, ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసారం.. తెలిస్తే లాభం

- భూసార పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు
- నియోజకవర్గంలో 5,450 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం



తుక్కులూరులో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది

నూజివీడు: పంటల సాగులో అధిక దిగుబడులు రావాలంటే భూసారం కీలకం. భూసారం తెలియాలంటే రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూసార పరీక్షలు చేయించడం ద్వారా నేలలో నత్రజని, భాస్వరం, పాస్ఫరస్ ఎంత మోతాదులో ఉందో తెలుస్తుంది. భూమిలో పోషకాలు, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర లోపాలు తెలుస్తాయి. తద్వారా వ్యవసాయ అధికారులు సిఫార్సు చేసిన ఎరువులు వాడటం ద్వారా ఎరువుల వృథా వాడకం తగ్గడమే కాకుండా ఎరువులపై పెట్టుబడి కూడా తగ్గుతుంది. మన భూమి సేద్యానికి అనువుగా లేకపోతే ఎలా బాగు చేసుకోవాలో, దానికి ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలిసి వాటిని వేయడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుంది.

70 వేల ఎకరాల్లో సేద్యం

నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలు ఉండగా ఈ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, దాళ్వా సీజన్‌లో మొక్క జొన్న, మిర్చి తదితర పంటలను రైతులు సాగు చేస్తారు. నాలుగు మండలాల్లో కలిపి దాదాపు 70 వేల ఎకరాల్లో రైతులు సేద్యం చేస్తారు. వేసవి తరువాత వచ్చే ఖరీఫ్ నాటికి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలను నిర్వహించి వాటి ఫలితాలను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మట్టి నమూనాల సేకరణ ఇలా..

వ్యవసాయ భూముల్లో ఆరు అంగుళాలు లేదా 15 సెంటీ మీటర్ల లోతు వీ ఆకారం గుంతను తీస్తారు. పండ్ల తోటల్లో అయితే ఐదు అడుగుల గొయ్యి తవ్వి అడుగుకొకటి చొప్పున ఐదు నమూనాలు సేకరిస్తారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష ల్యాబ్‌కు పంపుతారు. ఫలితాలు వచ్చిన తరువాత ఏఏ పోషకాలు వాడాలో వ్యవసాయాధికారులు రైతులకు వివరిస్తారు.

ఆరు రకాల పరీక్షలు

సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష ల్యాబ్‌కు పంపిన తరువాత అక్కడ ఆరు రకాల పరీక్షలు చేస్తారు. నత్రజని, భాస్వరం, పొటాష్ లభ్యతతో పాటు నేల స్వభావం, లవణాల లభ్యత, ఆమ్ల, క్షార లక్షణాలకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. వాటి ఆధారంగానే రైతులకు సూచనలు చేస్తారు.

మండలాల వారీగా మట్టి నమూనాల సేకరణ లక్ష్యం ఇలా

మండలం	సేకరించాల్సిన మట్టి నమూనాలు
నూజివీడు	1,500
ఆగిరిపల్లి	1,500
ముసునూరు	1,200
చాట్రాయి	1,250
మొత్తం	5,450

విస్తృతంగా మట్టి నమూనాల సేకరణ



వేసవిలో మట్టి నమూనాలను విస్తృతంగా సేకరించేలా చర్యలు తీసుకున్నాం. భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులను, పోషకాలను వాడతాం. దీని వలన వృథా వాడకం తగ్గిపోయి పెట్టుబడి కూడా తగ్గుతుంది. తద్వారా తక్కువ పెట్టుబడితో పంటల దిగుబడి సైతం పెరుగుతుంది.

–ఎ.చాముండేశ్వరి, ఇన్‌చార్జి ఏడీఏ, నూజివీడు

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఘన వీడ్కోలు



ప్రిన్సిపాల్ నవీన లావణ్యలతను సత్కరిస్తున్న విద్యార్థులు

నూజివీడు: కృష్ణా యూనివర్సిటీకి చెందిన నూజివీడు ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంలో శనివారం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలు, జ్ఞాపకాలు, అధ్యాపకుల సహకారం, క్యాంపస్‌లో పలు అంశాలను, అభిప్రాయాలను పంచుకున్నారు. జూనియర్ విద్యార్థులు క్యాంపస్‌లోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీజీ కేంద్రం ప్రిన్సిపాల్ జె. నవీన లావణ్యలతను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నిజం చేయాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కో–ఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారి షేక్ అన్వర్ బాషా, కె. ప్రభాకర్, తిరుమలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి సుందరయ్య పేరు పెట్టాలని వినతి

ఇబ్రహీంపట్నం: గన్నవరం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య పేరు పెట్టాలని ఇబ్రహీంపట్నానికి చెందిన న్యాయవాది వల్లభనేని పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావుకు శనివారం రిజిస్టర్ పోస్ట్ ద్వారా వినతి పత్రాలు పంపారు. 1955లో గన్నవరం నియోజకవర్గానికి తొలి శాసన సభ్యుడిగా సుందరయ్య ఎన్నికయ్యారని చెప్పారు. తన 17వ ఏట మహాత్మా గాంధీ నాయకత్వంలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేక ప్రదర్శన, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ వంటి పలు ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారని చెప్పారు. విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం సముచితమన్నారు.

కిశోర బాలికలకు శిక్షణ



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాట్రాయి: కిశోర బాలికలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రమణ అన్నారు. శనివారం చాట్రాయి అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య పరిరక్షణపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు.

పునీత జోజప్పను సదా గౌరవించాలి



సమష్టి దివ్య బలిపూజ సమర్పిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు, గురువులు

ముసునూరు: మానవాళికి సహాయపడిన పునీత జోజప్పను సదా గౌరవించాలని విజయవాడ ఆర్‌సీఎం మేత్రాసన బిషప్ రెవ.తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. ముసునూరు ఆర్సీఎం విచారణకర్త రెవ.ఫా జోసఫ్ తంబి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న పునీత జోజప్ప, ముసునూరు విచారణ 42వ ఆవిర్భావ మహోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ జోసఫ్ రాజారావు పలువురు విచారణ గురువులతో కలిసి సమష్టి దివ్యబలిపూజ సమర్పించారు. విశ్వాసులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీస్తు ప్రభువు చేసిన అద్భుత కార్యాలకు ప్రత్యక్ష సాక్షులుగా జోజప్ప, మేరీమాత నిలిచారని, వారిని గౌరవించడం మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. ముసునూరు విచారణ సిస్టర్స్, బోర్డింగ్ విద్యార్థినులు యూత్ సభ్యులు ఆలపించిన క్రీస్తు గీతాలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సహాయక ఫాదర్లు ఇలవర్సన్, సిస్టర్లు, భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు సన్మానం



జి.కొండూరు: మండల పరిధి వెల్లటూరు పంచాయతీ పరిధిలో ఐదు వందల మార్కులకు పైగా సాధించిన పన్నెండు మంది విద్యార్థులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుజానమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం సన్మానించారు. విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి

చాట్రాయి: అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజూవారి కూలీలుగా జీవిస్తున్న ప్రజలు ప్రభుత్వ దృష్టిలో లబ్ధిదారులుగా మిగిలిపోతున్నారని, వారికి వ్యవసాయ రంగంలో కూలి పనులు కరువవుతున్నాయని చెప్పారు. పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆగిరిపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, ఎస్ఐ శుభ శేఖర్ సూచించారు. శనివారం స్థానిక వడ్లమాను రోడ్డులో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ వాడకపోవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేసి కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



ఆగిరిపల్లి: తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేయూతనందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం ప్రధానోపాధ్యాయిని పుష్పలతకు రూ.25 వేలు విలువైన ప్రింటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేదాంతం లీలా మనోహర్ ప్రసాద్, షేక్ మీరావలి, అమ్మిశెట్టి రమేష్, జాన్ భూషణ్, హారిక, దివ్య పాల్గొన్నారు.

ఏఐతో బోధనా నైపుణ్యాలు విస్తృతం



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణశివ ప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ఆధారిత బోధన, పరిశోధన ద్వారా అధ్యాపకుల్లో బోధనా నైపుణ్యాల పెంపు సాధ్యమవుతుందని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆచార్యులు డాక్టర్ ఎం.కృష్ణశివప్రసాద్ అన్నారు. కేబీఎన్ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ఏఐ ఆధారిత బోధనా నైపుణ్యాల పెంపు' అంశంపై అధ్యాపక నైపుణ్యాభివృద్ధి (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన శివప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులు స్మార్ట్ కంటెంట్ తయారు చేయడానికి అనేక ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మూల్యాంకనం, గ్రేడింగ్ తదితర వ్యవస్థాగతమైన పనులు ఎంతో తేలికగా నిర్వహించవచ్చన్నారు. విద్యారంగంలో ఏఐ తీసుకువస్తున్న మార్పులు, విద్యా బోధనలో దాని పాత్రను వివరించారు.పరిశోధనలో వేగవంతమైన సమాచార విశ్లేషణకు ఏఐ టూల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆధునిక ఏఐ టూల్స్ వాడకాన్ని ప్రాక్టికల్ డెమోలతో చూపించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ అధ్యాపకులు మారుతున్న సాంకేతిక విధానాలు, విద్యారంగ సంస్కరణలను దృష్టిలో ఉంచుకుని బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్త, అతనికి సహకరిస్తున్న అత్త, మామ, మరిదిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపూడికి చెందిన యల్లాల నాగసాయిశ్రీకి పృథ్వీరాజ్‌తో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో కట్నం కింద రూ. 10 లక్షలు, 15 కాసుల బంగారం ఇచ్చారు. పెళ్లికి రూ.15లక్షలు ఖర్చు చేశారు. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత భర్త పృథ్వీరాజ్ ఎంఎస్ చేసేందుకు ఆస్ట్రేలియా వెళ్లాడు. భర్త లేకపోవడంతో అత్త, మామ, మరిది ఆమెను వేధించసాగారు. ఆ తర్వాత ఆమె కూడా ఆస్ట్రేలియా వెళ్లింది. అక్కడ తన భర్త పృథ్వీరాజ్ సాఫ్ట్‌వేర్ జాబ్ చేయడం లేదని, తనను మోసం చేశాడని తెలుసుకుంది. అక్కడ ఇద్దరి మధ్య గొడవల కావడంతో తిరిగి ఇండియాకు వచ్చారు. ఆ తర్వాత కట్నం కింద ఇచ్చిన నగదు, బంగారం విషయంలో తరచూ గొడవ పడేవారు. మద్యం సేవించడం, అప్పులు చేయడం, అదనంగా కట్నం ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఓ ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగంలో చేరగా ఆమె డెబిట్, క్రెడిట్ కార్డులు, ఫోన్ పే వాడుకుని స్నేహితులు, కుటుంబ సభ్యులకు డబ్బులు పంపేవాడు. పుట్టింటికి వెళ్లి డబ్బులు తెమ్మంటూ ఇబ్బందులకు గురిచేశాడు. మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవపడి ఇంటి నుంచి గెంటివేశాడు. గత నెలలో భర్త పృథ్వీరాజ్ బాగా మద్యం తాగి ఆమెపై, రెండేళ్ల పాపపై గొడవ పడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. వేధింపులు తాళలేక భర్త, అత్తమామ, మరిదిపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విగ్రహాల ప్లాట్‌ఫాంకు మెట్లు ఏర్పాటు చేయాలి

వినతిపత్రం అందజేసిన బీఎస్పీ నాయకులు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

నందిగామ రూరల్: పట్టణంలోని జాతీయ నాయకుల విగ్రహాలు ఎత్తులో ఉండటంతో జయంతి, వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు ఇబ్బందిగా ఉంటోందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ పేర్కొన్నారు. విగ్రహాల ప్లాట్‌ఫాం ఎక్కేందుకు మెట్లు, స్టాండు ఏర్పాటు చేయాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ, బహుజన్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమణబాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు రాజకీయ, ప్రజాసంఘాల, తదితర నాయకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిపాటి సూర్యం, దున్నా కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు



కంచికచర్ల: కంచికచర్లకు చెందిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. దేవిరెడ్డి వెంకట సుబ్బమ్మ ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. రాజు తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఎరుపు రంగు చీర ధరించి ఉందని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్ నంబర్ 08678 274333 లేదా ఎస్ఐ సెల్: 9440796460 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లక్ష మల్లెలతో అర్చన

జగ్గయ్యపేట అర్బన్: రామానుజుల వారి జయంతి ఉత్సవాలు పట్టణంలో శనివారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్రామానుజ గోష్ఠి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో స్వామి వారికి లక్ష మల్లె పూల అర్చన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర ప్రజలను అపహాస్యం చేసిన మోదీ

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):రాజధాని అమరావతికి నాడు చంద్రబాబు చేతిలో మట్టి, చెంబుడు నీళ్లు.. నేడు పవన్‌కళ్యాణ్ చేతిలో చాక్లెట్టు పెట్టి ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలను అపహాస్యం చేశారని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మండిపడ్డారు. నగరంలోని దాసరి భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత దశాబ్దకాలం నుంచి కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి కూడా అమరావతికి నిధులు కేటాయింపు విషయంలో ఎటువంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. అమరావతి నగరం కాదు.. ఒక శక్తి అని గారడీ తప్ప కేంద్రం నుంచి నిధులు కేటాయింపు విషయంలో ప్రధాని చేత ప్రకటన చేయించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డెప్యూటీ ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఒక రినొకరు పొడగడ్తల కోసమే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అమరావతి పునర్నిర్మాణ సభను ఏర్పాటు చేసుకున్నట్లు ఉందన్నారు. నిర్దిష్టంగా అమరావతి అభివృద్ధి కోసం సాయం చేస్తామని చెప్పకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం కేంద్రాన్ని ప్రశ్నించింది

గత ప్రభుత్వం నిధుల కేటాయింపుల కోసం వేదికపై కేంద్రాన్ని ప్రశ్నించిందని.. కాని ప్రస్తుత ప్రభుత్వం కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం రాజకీయ లబ్ధి కోసం మాత్రమే తాపత్రయం పడినట్లు స్పష్టమవుతోందన్నారు. 74 ప్రాజెక్టులకు, పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులకు నిధులు ఎంత..? విధులు, నిర్వహణపై స్పష్టత లేదన్నారు.

బీమా సదుపాయంపై కూలీలకు అవగాహన




పెనుగంచిప్రోలు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన కింద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.జనార్దనరావు తెలిపారు. ఈ మేరకు వారు మండలంలోని అనిగండ్లపాడు, కొణకంచి, లింగగూడెం గ్రామాల్లోని కూలీలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ రూ.20 చెల్లించిన ఉపాధి కూలీ ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.2లక్షల బీమా అందుతుందన్నారు. మరో ప్రీమియం రూ.436 చెల్లించే వారికి అదనంగా రూ.2లక్షల బీమా సదుపాయం ఉంటుందని వివరించారు. పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం 11,672 జాబ్‌కార్డులు ఉండగా 20,122 మంది కూలీలు ఉన్నారు. వీరిలో 4,500నుంచి 5 వేల మంది పనులకు హాజరవుతున్నారన్నారు. వీరందరూ ఈ బీమా సదుపాయం కోసం ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఎవ్వరికీ నేరుగా నగదు చెల్లించరాదన్నారు. బ్యాంకు ఖాతాల నుంచి మాత్రమే ప్రీమియం మినహాయించుకుంటారనే విషయాన్ని కూలీలంతా గమనించాలని ఏపీఓ కోరారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

విస్సన్నపేట: విస్సన్నపేట మండలంలో సోమవారం నుంచి ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ చినరాట్నాలు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సిబ్బంది ఆధార్ డేటా నమోదుకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగాలకు 18 మంది విద్యార్థుల ఎంపిక



కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్ శనివారం తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు చైన్నైకు చెందిన టీవీఎస్ బ్రేక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 18 మంది విద్యార్థులను కంపెనీ తరుపున ఆపరేటర్ ట్రైనీగా ఎంపిక చేశారన్నారు. ఎంపికయిన వారికి రూ. 2.45 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసి వారికి నియామక పత్రం ఉత్తర్వులు అందజేశారు. ఎంపికయిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ఎన్.భానుమూర్తి, అన్ని విభాగాల అధిపతులు అభినందించారు.

గోశాలకు ఎండు గడ్డి వితరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలకు శనివారం మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన రైతు కూచి శ్రీనివాసరావు తన ట్రాక్టర్‌పై 50 వరి గడ్డి కట్టలు తీసుకువచ్చి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శ్రీనివాసరావును అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.